క్లుప్తంగా

ఆసుపత్రి తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ చంద్రశేఖర్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని గంగోత్రి ఆసుపత్రిని శుక్రవారం జిల్లా ఉప ఆరోగ్య వైద్యాధికారి చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ, ల్యాబ్‌లతో పాటు అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ఆ యన వెంట నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారినులు నాగిని, సౌమ్యశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీల్లో శ్రీనివాస్‌కు కాంస్య పతకం



పతకం అందుకుంటున్న శ్రీనివాస్

హుజూర్‌నగర్ : పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన మొదటి ఫెడరేషన్ కప్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన హుజూర్‌నగర్‌కు చెందిన పోలేపల్లి శ్రీనివాస్ (శిల్పా) గురువారం కాంస్య పథకం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హుజూర్‌నగర్ ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 55- 59 ఏళ్ల విభాగం 200 మీటర్ల పందెంలో పసిడి పతకం, బ్రెస్ట్ స్ట్రోక్ 200 మీటర్ల విభాగంలో కాంస్య పతకం, 100 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీల రికార్డులు తనిఖీ



అవిరేణికుంటతండాలో వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ ఆంజనేయులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల, అవిరేణికుంటతండా, లాలితండా, కామంచికుంటతండా, బక్కమంతులగూడెం గ్రామ పంచాయతీల్లో రికార్డులను శుక్రవారం ఎంపీఓ ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు నాగేశ్వరరావు, నరేష్, పుణ్యేశ్వరి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం



రక్తదానం చేస్తున్న మధు

నడిగూడెం : అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన మాదాసు సైదులు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సైదులకు రక్తం అత్యవసరం కావడంతో నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గణేష్, మధు, తిరుమలేష్, ఉపేందర్, సాయి, సంతోష్, వంశీ తదితరులు స్వచ్ఛందంగా ఖమ్మం ఆసుపత్రిలో రక్తదానం చేశారు. దీంతో రక్తదానం చేసిన యువజన సంఘం సభ్యులను పలువురు అభినందించారు.

పేద కుటుంబానికి చేయూత



అచ్చయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో పేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడు పెద్దపంగ అచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు మాట్లాడుతూ అచ్చయ్య కుమారుడి చదువుకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు యూసఫ్, పెద్దన్న, విశ్వనాథ్, ఖాదర్‌పాషా, సైదులు, మోహన్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

'కార్పొరేట్'ను రద్దు చేయాలి

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. శుక్రవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వాలీబాల్ క్రీడపై పట్టు సాధించేలా..

- నాలుగేళ్లుగా శిక్షణ శిబిరం ఏర్పాటు
- జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించేలా తర్ఫీదు
- ఉత్సాహంగా నేర్చుకుంటున్న విద్యార్థులు



వాలీబాల్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ సహకారంతో నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరంలో పలువురు విద్యార్థులు శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఏప్రిల్ చివరి వారం నుంచి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. దీంతో స్థానిక పీఈటీ మన్నెం సీతారామిరెడ్డితో పాటు పలువురు పీఈటీలు 50 మంది విద్యార్థులకు వాలీబాల్ క్రీడలో తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, అదేవిధంగా సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ ఈనెల 31వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కేవలం శిక్షణ శిబిరంలోనే కాకుండా పాఠశాలలు తెరిచిన తరువాత కూడా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులకు శిక్షణ కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

అయితే మఠంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ పొందిన మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా మండలంలోని భీల్యానాయక్‌తండా జెడ్పీహెచ్ఎస్‌లో తాను పీఈటీగా పనిచేసి నలుగురు విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా శిక్షణ ఇచ్చినట్లు పీఈటీ సీతారామిరెడ్డి తెలిపారు. వాలీబాల్ ఆటలో నేర్పించిన మెళకువలతో విద్యార్థులు బాగా రాణిస్తూ పాఠశాలలకు మంచి గుర్తింపు తెస్తున్నట్లు పీఈటీలు చెబుతున్నారు.

క్రీడలో పట్టు సాధిస్తున్నాను



పాఠశాల మైదానంలో ఇస్తున్న వాలీబాల్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. పీఈటీల ప్రోత్సాహం బాగుంది. క్రీడలో రోజురోజుకూ మెళకువలు నేర్చుకొని పట్టు సాధిస్తున్నాను. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం.

– ఆర్. కోమల్‌సాయి, 9వ తరగతి విద్యార్థి

పీఈటీ ప్రోత్సాహంతో..



నాకు మొదట్లో వాలీబాల్ క్రీడ అంటే అంతగా ఆసక్తి లేదు. కానీ పీఈటీ సార్ ప్రోత్సాహంతో వాలీబాల్ క్రీడ నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం ఈ క్రీడపై ఆసక్తి మరింత పెరిగింది. జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషిచేస్తా.

– పి.వినయ్, 10వతరగతి విద్యార్థి

పట్టుదలతో నేర్చుకుంటున్నా



శిక్షణ శిబిరంలో వాలీబాల్ క్రీడను పట్టుదలతో నేర్చుకుంటున్నాను. పీఈటీ సార్ ప్రోత్సాహం మరింత ఉత్సాహన్ని ఇస్తుంది. మండలంలో ఎంతో మంది విద్యార్థులు వాలీబాల్ క్రీడలో రాణిస్తున్నారు. నేను కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో వాలీబాల్ క్రీడలో ఆడి గుర్తింపు పొందాలని లక్ష్యం పెట్టుకున్నా.

– ఎం. రూపశ్రీ, 9వ తరగతి

నాలుగేళ్లుగా శిక్షణ ఇస్తున్నాం



భీల్యానాయక్‌తండా గిరిజన విద్యార్థులు మేం ఇచ్చిన శిక్షణతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దీంతో మరింత మంది క్రీడలో రాణించేలా శిక్షణ ఇస్తున్నాం. జిల్లా యువజన సర్వీసులు, క్రీడలశాఖ సహకారంతో గత నాలుగేళ్లుగా వేసవిలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం.

– మన్నెం సీతారామిరెడ్డి, పీఈటీ, నియోజకవర్గ స్కూల్ గేమ్స్ సెక్రటరీ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లకుమళ్ల జ్యోతి

నేరేడుచర్ల : విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచికల్‌దిన్న పీహెచ్‌సీలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో విఫలమౌతున్నారని ఎంపీటీసీ సభ్యుడు ఎల్లబోయిన లింగయ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎంపీపీ స్పందించి వైద్యాధికారి సీతామహాలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. అనంతరం నేరేడుచర్ల ప్రాథమి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగిని మాట్లాడుతూ.. నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలకు గాను ప్రజాప్రతినిధులు సిఫారసు చేయాలని అన్నారు. కాగా, ఎన్నికల కోడ్ ఉండటంతో సమావేశంలో ఎలాంటి తీర్మానాలు చేయలేదు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీఓ విజయకుమారి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏఓ అనిల్‌కుమార్

మునగాల : విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్, విస్తరణ అధికారి షేక్ ముస్తఫా కోరారు. శుక్రవారం మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెం, గణపవరం గ్రామాల్లో నిర్వహించిన రైతు సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఆ విధంగా కొనుగోలు చేస్తే పంటనష్టం జరిగితే వ్యవసాయాధికారులను సంప్రదించి ఆ డీలరు ద్వారా కంపెనీ నుంచి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. సరైన పాకింగ్, సీల్, లేబుల్, ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాల సంచులను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. సంచులపై విత్తనరకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర వివరాలు సరిగా ఉన్నాయో.. లేవో? చూసుకుని కొనాలని సూచించారు. ప్యాకింగ్ లేని, సీల్ తీసి ఉన్న విత్తన సంచులు, పగిలిన విత్తన ప్యాకెట్లు, మూతలు తీసిన డబ్బాల్లోని విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. ఈ సదస్సులో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మత్స్య సొసైటీ సభ్యులు

కోదాడరూరల్ : కోదాడ పెద్దచెరువు శిఖం భూమిలో మట్టి పోసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్య సహకార సంఘం సభ్యులు శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఇరిగేషన్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ఎండిపోయిన సమయాల్లో కొందరు అక్రమార్కులు శిఖం భూమి ఆక్రమణకు తెరలేపుతున్నారని తెలిపారు. రామిరెడ్డిపాలెం రోడ్డులో ఓ వ్యక్తి రెండెకరాలకు పైగా చెరువు భూమిని ఆక్రమించుకుంటున్నాడని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి చెరువు ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందరబోయిన వీరస్వామి, కోశాధికారి వేముల పుల్లయ్య, సెక్రటరి ఐతన బోయిన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రెడ్డుబోయిన ఉపేందర్, మర్రి సంతోష్, గుండ్లపల్లి రామారావు, సడం నరేష్, శ్రీకాంత్ ఉన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీదే విజయం



పానుగోడులో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

గరిడేపల్లి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిదే విజయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల పరిధిలోని పానుగోడు గ్రామంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల విశ్వాసాన్ని కోల్పోయి అంపశయ్యపై నిలిచిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు మలికంటి శ్రీనివాస్, చామకూరి వెంకటేశ్వర్లు, మండవ వీరయ్య, షేక్ మీరా, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



గరిడేపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మునగాల : ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

మునగాల : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర అజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి, విద్యావేత్త అయిన రాకేష్‌రెడ్డికి అమూల్యమైన ఓటు వేసి మండలికి పంపించాలని పట్టభద్రులను విజ్ఞప్తి చేశారు. చట్టసభలను మలీనం చేయడానికి తీన్మార్ మల్లన్న లాంటి బ్లాక్ మెయిలర్‌లు ముందుకు వస్తున్నారని, పట్టభద్రులు ఆలోచించి విద్యావంతుడైన రాకేష్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, కార్యదర్శి ఎలక వెంకటరెడ్డి, నాయకులు వి.రామిరెడ్డి, ఉడుం కృష్ణ, ఎల్‌పి.రామయ్య, నూకమళ్ల రామకృష్ణ, దొంగరి శ్రీనివాసరావు, కాసర్ల రంగారావు, గోపిరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం

గరిడేపల్లి : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్‌లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైదులు, మాశెట్టి శ్రీహరి, రాంసైదులు, కడప విశాఖ, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, పెండెం వీరయ్య, అంజి, రాజ్ మహ్మద్, పెండెం వెంకటరాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మఠంపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శుక్రవారం ఆ పార్టీ నాయకులు మఠంపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను అభ్యర్థించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, పిండిప్రోలు రామచంద్రయ్య, పోతబత్తిని శ్రీనివాస్, మామిడి శ్రీనివాస్, రాజీవ్, నరసింహారావు, శివారెడ్డి, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



కోదాడరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న మేదరమెట్ల వెంకటేశ్వరరావు



నేరేడుచర్ల : దిర్శించర్లలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్ : ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, ప్రజాసమస్యలపై గళమెత్తే తీన్మార్ మల్లన్నకు విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఓటేసి గెలిపించుకుందామన్నారు. అవకాశవాద, మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, మట్టిపల్లి సైదులు, జె.నరసింహారావు, జుట్టుకొండ బసవయ్య, బెల్లంకొండ సత్యనారాయణ, నాగటి చిన్నరాములు, రాపోలు సూర్యనారాయణ, అలసగాని బ్రహ్మయ్య, దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం

నేరేడుచర్ల : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ పట్టభద్రులు తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, వెంకట సైదులు, సైదిరెడ్డి, జలీల్, బాల్‌రెడ్డి, వినోద్, మహేష్, నాగయ్య, శ్రీను, వంశీ, గోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మఠంపల్లి : ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, గాదె లూర్ధుమారెడ్డి, కొత్తపల్లి కృపానందం, దైదా రాయలు, గాలి చిన్నపురెడ్డి, మల్లికంటి బుచ్చయ్య, బోయపాటి ఆంతోనిరెడ్డి, శౌరీ, వీరబాబు, వెంకటయ్య, రాములు, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో..

నడిగూడెం : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలంటూ శుక్రవారం మండల పరిధిలోని శ్రీరంగాపురంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గోపాల్‌దాస్ గోవింద్, నాయకులు అల్లు ప్రసాద్‌రావు, ఎల్.వీరబాబు, మంగయ్య, రాజు, పిచ్చయ్య, వెంకన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కొమ్ము ఈదారావు, ఎండి.రషీద్, చింతకాయల ఉపేందర్, శెట్టి గరి, రామాంజి, కాసర్ల కోటయ్య, సామాజిక కార్యకర్త గంధం సైదులు, పంది జాన్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

హుజూర్‌నగర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకుడు ఎండి అజీజ్ పాషా కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ ఉద్యోగస్తులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు సుబ్బరాజు, రామయ్య, సత్యనారాయణ, మట్టయ్య, వీరయ్య, గోవిందరావు, జగన్, బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలి

గరిడేపల్లి : ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటికం ఆషారమేష్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పానుగోడు గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కటకం రామకృష్ణ, బత్తిని రాంబాబు, సోమగాని వెంకన్న, నేలపట్ల వెంకటేశ్వర్లు, కోమద్రాసు సైదులు, కుర్రి శివ, నక్క వెంకన్న, రాజీవ్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డి దంపతులకు ఎస్పీ సన్మానం



రామకృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి దంపతులు

మునగాల : మండలంలోని మాధవరంలో శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు అరె.రామకృష్ణారెడ్డి దంపతులను గ్రామవాసి, వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సీనియర్ సిటిజన్స్, వృద్ధులు, వికలాంగులకు తాను సహాయ సహకారాలు అందిస్తానని, సీనియర్ సిటిజన్స్, వికలాంగుల కుటుంబాలకు ఏ లోటు రాకుండా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ రాష్ట్ర నాయకుడు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షురాలిగా సైదాబి



షేక్ సైదాబి

గరిడేపల్లి : ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం గరిడేపల్లి మండల అధ్యక్షురాలిగా షేక్ సైదాబి నియమితులయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు. సంఘం మండల ఉపాధ్యక్షులుగా గోపినాథ్, మాతంగి స్వామిదాస్, కార్యదర్శిగా బచ్చలకూరి సతీష్‌బాబు, సహాయ కార్యదర్శి బి.పున్నం, కోశాధికారి టి.ధనలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సైదాబి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు శుక్రవారం గ్రామానికి చెందిన పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సేకు మురళీకృష్ణ – లక్ష్మీసునంద దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించినట్లు ఆ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు సేకు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, కార్యదర్శి ఇమ్మడి సతీష్‌బాబు, సభ్యులు నర్రా శ్రీపాల్‌రెడ్డి, వెంపటి ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, దాచేపల్లి భవ్య పాల్గొన్నారు.

ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేక నీరు వృథా

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులైన్లు, పబ్లిక్ నల్లాలకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అధికారులను కోరారు. శుక్రవారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. అసలే నీటి ఎద్దడి ఉన్న ఈ పరిస్థితిలో ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతుందన్నారు. మున్సిపాలిటీలో నూతనంగా సీసీ రోడ్లు వేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, చిలకరాజు శ్రీను ఉన్నారు.

మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

మేళ్లచెరువు : రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టి రామచంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా రాజకీయ విలువలతో ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, వెంటనే ఉత్తమ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఉత్తమ్‌పై నిరాధార ఆరోపణలు సరికాదు

కోదాడరూరల్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీజేపీ ఎల్పీ నేత మహేశ్వరరెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి శేషు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశస్థాయిలో అత్యున్నతమైన ఉద్యోగాన్ని వదులుకొని ప్రజాసేవకై రాజకీయాల్లోకి వచ్చి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడు మంత్రి ఉత్తమ్ అని తెలిపారు. బీజేపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చన



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో సహస్రనామ కుంకుమార్చనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో వెండి వస్తువులు చోరీ



హుజూర్‌నగర్‌రూరల్ : దుండగులు పగులగొట్టిన లింగమంతులస్వామి ఆలయం తలుపులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం గ్రామ శివారులో గల లింగమంతులస్వామి ఆలయంలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ యాదవ కుల పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఉన్న లింగమంతుల స్వామి ఆలయానికి శుక్రవారం గ్రామ యాదవ కుల పెద్దలు వెళ్లారు. ఈక్రమంలో ఆలయం తలుపులు పగులగొట్టబడి ఉన్నాయి. ఆలయంలో విలువైన వెండి కిరీటం, త్రిశూలం, గోపురం ఇతర ఆభరణాలు కలిపి సుమారు 30 తులాల వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు వారు తెలిపారు. కాగా ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.